# ముని ప్లస్ మాణిక్యం వెరసి సున్నిత హాస్యం

చాలా అరుదైన ఆ యింటి పేరు కలిగిన నరసింహారావుగారిని – ఏకాగ్రతలో ముని, మేధాశక్తిలో మాణిక్యం అని శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి, కొడవటిగంటి కుటుంబరావు, చింతా దీక్షితులు మొదలైన వారు  శ్లాఘించారట.

మునిమాణిక్యం పేరు చెప్పగానే ఎవరికైనా ముందు గుర్తుకొచ్చేది కాంతం. నాన్న రాసిన మొదటి నవల  'టీ కప్పులో తుఫాను', ఇందులోనే మొదటిసారి కాంతం పాత్ర కనబడుతుంది. కాంతం కథలకి మా అమ్మే స్ఫూర్తి, ప్రేరణ అని వారి కుమార్తె సి.హెచ్. మంగ వివరిస్తూ విశ్వనాథవారు మా నాన్నగారిని ముట్నూరి కృష్ణారావుగారి దగ్గరకి తీసుకు వెళ్ళి పరిచయం చేస్తుంటే ఆయన వెంటనే 'కాంతం భర్త కాదూ' అన్నారని తెలిపారు.

మధ్య తరగతి జీవితాల్లోని అనుభవాల్ని హాస్యంగా మలచి బాగా జీవించాలంటే సెన్సాఫ్ హ్యూమరు వుండాలని హితవు పలికిన మునిమాణిక్యం నరసింహారావు (1898–1973) గారి 116వ జన్మదిన వేడుకలు మార్చి 15న సన్‌షైన్ హాస్పిటల్స్, ఫిల్మీడియా సౌజన్యంతో వారి పేరున స్థాపించిన సాహితీ పీఠం తరఫున వారి మనుమలు, మనుమరాళ్ళు; సాహితీ ప్రియులు, హాస్యప్రియుల మధ్య వేడుకగా జరిగాయి.

వారి మనుమరాలు  శేషుకుమారి, మునిమాణిక్యం నరసింహారావుగారి జీవిత విశేషాలు ప్రేక్షకులతో పంచుకుంటూ, తమ్ముడు రాంచందర్‌తో కలిసి స్థాపించిన సాహితీ పీఠం వేదికగా వివిధ రంగాల్లో హాస్యం పండించిన వారిని పురస్కరించే కార్యక్రమం చేబట్టామన్నారు. సినిమా రంగానికి రేలంగి నరసింహారావు, టి.వి. కి గుణ్ణం గంగరాజు, హాస్య రచనకి రాంపా, కార్టూన్ రంగంలో సరసి, మిమిక్రీ రంగానికి శ్రీనివాస్, హాస్యావధాని జె.ల్. నరసింహం గార్లను కుటుంబ సభ్యులు శాలువల్తో సత్కరించి జ్ఞాపికలు అందించారు. 'హాస్య చమత్కార చక్రవర్తి మునిమాణిక్యం నరసింహారావు' గ్రంధ రచయిత్రి డాక్టర్ కె.బి. లక్ష్మికి ప్రత్యేక పురస్కారం అందచేశారు.

సన్మానానికి కృతజ్ఞతలు తెలుపుతూ మునిమాణిక్యం నరసింహారావుగారికి ఆనాటి సాహితీ సమితిలో సభ్యుడు  కావాలన్న కోర్కెని విశ్వనాథ సత్యనారాయణగారు ఎలా తీర్చారో చెప్పి, వారి సమగ్ర పరిశోధనా గ్రంథం 'మన హాస్యం' రచనకి డాక్టరేట్ దక్కి వుండాల్సిందని వాపోయారు. దాంపత్య జీవితంలోని రసగుళికల్ని మునిమాణిక్యం వారు రచనల్లో అందచేస్తే తను తీసిన సినిమాలు దాదాపు అన్నీ

దాంపత్య జీవితానికి చెందడం వల్ల తనకు అందించిన జ్ఞాపిక చాలా గౌరవప్రదం అని రేలంగి నరసింహా రావు అన్నారు. ఈరోజుల్లో సున్నిత హాస్యం కరువై ఛానెళ్ళలోను, సినిమాల్లోను మొరటు హాస్యం చోటు చేసుకోవడం విచారకరమని మిమిక్రీ శ్రీనివాస్ అభిప్రాయపడ్డారు. హాస్యావధాని జె.ఎల్. నరసింహం చక్కటి ఛలోక్తులతో సభికులని రంజింపచేశారు.

ఆహ్లాదకరంగా జరిగిన సభ ముగింపులో – ఆరోజుల్లో కవులకి గండపెండేరాలు, గజారోహణలు జరపడం గురించి మునిమాణిక్యం వారు చమత్కారంగా – ఎవరికీ అర్థం కాని కవిత్వం రాసేవారికి గజారోహణాదులు చేస్తారు, అందరికీ అర్థం అయే వచనం రాసినవారికి గజం గుడ్డ కూడా యివ్వరు అన్నారని గబ్బిట కృష్ణమోహన్ చెబుతూ, 'అప్పు చేయడం–తీర్చడం' పుస్తకంలో – అప్పు చేసిన మొత్త మును తిరిగి యిచ్చేవాడు అధముడు, కాలం గడిపేవాడు మధ్యముడు, తెచ్చిన మరుక్షణంలో ఆ విషయ మును సులువుగా మరవగలిగినవాడు ఉత్తముడు అంటూ సూత్రీకరించారన్నారు.

మనోరంజకంగా సభను నిర్వహించిన రాంపా మునిమాణిక్యం గారి కుటుంబ సభ్యులకు, సభికు లకు సముచితంగా ధన్యవాదాలు తెలిపారు.

– గబ్బిట కృష్ణమోహన్